క్లుప్తంగా

పకడ్బందీగా పారిశుద్ధ్య పనులు



చెత్తకుప్పలను తొలగించి బ్లీచింగ్ చల్లుతున్న వైద్య సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

చంద్రగిరి : మండలంలోని ఏ.రంగంపేటలో వైద్యశాఖ, పంచాయతీ సిబ్బంది పర్యవేక్షణలో శనివారం పకడ్బందీగా పారిశుద్ధ్య పనులు చేపట్టారు. శుక్రవారం సాక్షి పత్రికలో 'రంగంపేటలో పడకేసిన పారిశుద్ధ్యం' శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై కొటాల పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రియాంక స్పందించారు. ఈ మేరకు ఏ.రంగంపేట, యాదవకాలనీలో పర్యటించారు. చెత్తాచెదారాలను తొలగింపజేశారు. బ్లీచింగ్ చల్లించారు. నీటి తొట్టిలను పరిశుభ్రం చేయించారు. వర్షాకాలం నేపథ్యంలో జ్వరాలు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. డిప్యూటీ డెమో అధికారి కిరణ్ కుమార్, సబ్ యూనిట్ అధికారి శివయ్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం అధికారి వెంకటేశ్వర రావు, సూపర్‌వైజర్ గంగయ్య పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా గణపతి హోమం



హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

రామచంద్రాపురం : వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీ శక్తి పీఠంలో శనివారం శాస్త్రోక్తంగా వజ్ర భైరవ గణపతి హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం శ్రీ సిద్ధేశ్వరానంద భారతి, శ్రీ రమ్యానంద భారతీ సంప్రదాయబద్ధంగా భక్తులకు మంత్రోపదేశం చేశారు. ఈ క్రమంలోనే భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు.

ప్లాట్లు కేటాయించాలని డిమాండ్



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీపీఎం నేతలు

తిరుపతి కల్చరల్ : శెట్టిపల్లె భూ సమస్యను పరిష్కరించి బాధితులకు ప్లాట్లు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు డిమాండ్ చేశారు. శెట్టిపల్లె భూ సమస్యలపై శనివారం వేమన విజ్ఞాన కేంద్రంలో సీపీఎం నేతలు కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ శెట్టిపల్లె సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ల్యాండ్ పూలింగ్ చేయాలన్నారు. 2019లో అప్పటి టీడీపీ ప్రభుత్వం బలవంతంగా రైతులు వద్ద 70 శాతం, ప్లాట్ల యజమానుల నుంచి 50 శాతం భూమిని లాక్కుందని ఆరోపించారు. బాధితులతో కలిసి సమస్య పరిష్కారానికి పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. సీపీఎం నేతలు టి.సుబ్రమణ్యం, కె.వేణుగోపాల్, ఎస్.మాధవ్, పి.బుజ్జి, పి.రమేష్, ఎ.రాధాకృష్ణ, ఎం.రాజు, మునిరాజా, టీఆర్ఎస్ మణ్యం, మోహన్‌నాయుడు పాల్గొన్నారు.

కబేళాలకు గోవులను తరలిస్తున్న వాహనం సీజ్



తిరుచానూరుకు తరలించిన గోవులు

చంద్రగిరి: కబేళాలను గోవులను తరలిస్తున్న బొలెరో వాహనాన్ని పోలీసులు సీజ్ చేసి 9 గోవులను రక్షించిన ఘటన శనివారం చోటుచేసుకుంది. నెల్లూరు నుంచి పీలేరుకు 9 గోవులను బొలేరో వాహనంలో గోవధ కోసం తరలిస్తుండగా సమాచారం అందుకున్న పోలీసులు సీ.మల్లవరం సమీపంలో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. గోవులను తరలిస్తున్న ముఠా సభ్యులు సయ్యద్ వల్లీ, సాదిక్, జాకీర్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, వాహనాన్ని సీజ్ చేశారు. తిరుచానూరులోని గోశాలకు గోవులను తరలించారు.

'అనధికార' పేరుతో కొరడా

తిరుమల : తిరుమలలో టీటీడీ రెవెన్యూ అధికారుల అనధికార దుకాణాల పేరుతో స్థానికుల దుకాణాలపై కొరడా ఝుళిపిస్తున్నారు. అనధికార తట్టలపై చర్యలు తీసుకోవాల్సి ఉండగా షాపింగ్ కాంప్లెక్స్ స్థానికులు నిర్వహిస్తున్న దుకాణదారులకు పలు కారణాలతో జరిమానాలు విధిస్తున్నారు. కొందరు నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువ ఆక్రమించుకున్నారని, మరికొందరు ధరల పట్టిక లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తున్నారని ఒక్కొక్క దుకాణానికి రూ.25వేల వరకు జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీచేశారు. దీంతో స్థానికుల దుకాణాలకు అద్దెలు కట్టి వ్యాపారాలు చేస్తున్న వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనధికార తట్టలపై చర్యలు తీసుకోమంటే స్థానికులు నడుపుతున్న దుకాణాలపై చర్యలు తీసుకోవడంపై ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

మట్టి.. కొల్లగొట్టి

ప్రకృతి వనరులను పచ్చ నేతలు దోచేస్తున్నారు. కనిపించిన భూములను కబళించి గ్రావెల్ దందా నడిపిస్తున్నారు. కొండలు.. గుట్టలను సైతం ఇష్టారాజ్యంగా తవ్వేసి తరలించేస్తున్నారు. భారీ టిప్పర్లతో మట్టిని అక్రమంగా రవాణా చేస్తున్నారు. లేఅవుట్‌లకు అమ్మేసి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రశ్నించిన వారిపై దాడులకు తెగబడుతున్నారు. అధికారులు మాత్రం కళ్లకు గంతలు కట్టుకుని నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఫిర్యాదు చేసిన వారిని భయభ్రాంతులకు గురిచేసి తెలుగు తమ్ముళ్లకు పూర్తి సహకారం అందిస్తున్నారు.

- చిన్నగొట్టిగల్లులో యథేచ్ఛగా గ్రావెల్ దందా
- చిన్నగొట్టిగల్లులో యథేచ్ఛగా గ్రావెల్ దందా
- ఇష్టారాజ్యంగా తవ్వేసి.. తరలిస్తున్న టీడీపీ నేతలు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు ఇష్టారాజ్యంగా తవ్వేసి.. తరలిస్తున్న టీడీపీ నేతలు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు



గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్

భాకరాపేట : చిన్నగొట్టిగల్లులో టీడీపీ నేతలు రెచ్చిపోతున్నారు. యథేచ్ఛగా మట్టి దందా సాగిస్తున్నారు. భారీ యంత్రాలతో మట్టిని తవ్వి టిప్పర్లతో తరలించేస్తున్నారు. ఈ క్రమంలోనే సర్వే నంబర్ 407లోని ప్రభుత్వ భూమిలో ప్రస్తుతం పాగా వేశారు. ఇష్టారాజ్యంగా తవ్వకాలు సాగిస్తున్నారు. ఇందుకోసం వాహనాలు సులభతరంగా వెళ్లేందుకు దారిని సైతం ఏర్పాటు చేసుకున్నారు. తిరుపతి పరిసరాల్లో వేస్తున్న లేఅవుట్లకు మట్టిని అమ్ముకుని రూ.కోట్లు కూడబెట్టుకుంటున్నారు.



యంత్రంతో మట్టిని టిప్పర్‌లోకి లోడ్ చేస్తున్న దృశ్యం

కన్నెత్తి చూడని అధికారులు

పొలం చదును, గృహ అవసరాలకు రైతులు, సామాన్యులు మట్టిని తరలిస్తే వెంటనే రెవెన్యూ, పోలీసు అధికారులు రంగంలోకి దిగేస్తారు. కేసులు నమోదు చేసి వేధిస్తుంటారు. అదే అధికార పార్టీ నేతలు నదులు, చెరువులు, ప్రభుత్వ, ప్రైవేట్ భూములు, కొండలు, గుట్టలను విడిచిపెట్టకుండా తవ్వకాలు చేపట్టినా ఇదే అధికారులు కళ్లకు గంతలు కట్టేసుకుంటారు. వీరైతే మామూళ్లు తీసుకుని చూసీచూడనట్లు వెళ్లిపోతుంటారు. పైగా ఫిర్యాదు చేసిన వారినే భయపెట్టి తరిమేస్తుంటారు. నేతల అక్రమాలకు వంత పాడుతుంటారు. చిన్నగొట్టిగల్లులోనూ ఈ పరిస్థితే ఏర్పడింది. పచ్చమూక దౌర్జన్యాలను అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు. కళ్లెదుటే మట్టి దందా నడుస్తున్నా స్పందించడం లేదు. దీంతో అధికారుల వ్యవహారశైలిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నోటీస్ బోర్డు

- బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవన్‌లో ఉదయం 9.30 గంటలకు '75 ఏళ్ల మహాప్రస్థానం గీతాలు– నేటి సామాజిక పరిస్థితులు'పై చర్చాగోష్ఠి.
- పద్మావతీపురంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు సమావేశం.
- ఇస్కాన్ మందిరంలో ఉదయం 11 గంటలకు రాధా గోవిందులకు శంఖాభిషేకం,12.30 గంటలకు రాధారాణి లీలలపై ప్రవచనం.
- ఎస్వీ సంగీత కళాశాలలో ఉదయం 8.30 గంటలకు ఆదిభట్ల నారాయణదాసు విగ్రహానికి పుష్పాంజలి, అనంతరం 9 నుంచి మహతి కళాక్షేత్రంలో హరికథాగానలాపన.

నేడు తుమ్మలగుంటలో నిమజ్జనోత్సవం

తిరుపతి రూరల్ : తుమ్మలగుంటలోని తుంబుర గణపతి ప్రతిమను ఆదివారం సాయంత్రం 3 గంటలకు నిమజ్జనోత్సవం చేపట్టనున్నట్లు బాల వినాయక కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి పర్యవేక్షించనున్నట్లు తెలిపారు.

పెద్దిరెడ్డికి మహిళా నేతల సత్కారం



పెద్దిరెడ్డితో మహిళా విభాగం నేతలు, మాజీ ఎంపీ రెడ్డెప్ప తదితరులు

తిరుపతి మంగళం : వైఎస్సార్‌సీపీ కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వరుదు కల్యాణి, వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాని పూజితరెడ్డి, జోనల్ ఇన్‌చార్జి గౌరీ, జిల్లా అధ్యక్షురాలు మాధవిరెడ్డి ఘనంగా సత్కరించారు. శనివారం తిరుపతి మారుతీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో పెద్దిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళా విభాగం నేతృత్వంలో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. మాజీ ఎంపీ రెడ్డప్ప, పార్టీ సంస్థాగత ఎన్నికల కమిటీ కార్యదర్శి వజ్ర భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

కరదీపికపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సెక్టోరియల్ అధికారి సారథి

పాకాల : కరదీపికపై ఉపాధ్యాయులకు అవగాహన అవసరమని, మూల్యాంకన పుస్తకాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని జిల్లా సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారి సారథి స్పష్టం చేశారు. శనివారం మండలంలోని ఓబులశెట్టివారిపల్లె జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుల క్లస్టర్ రిసోర్స్ సెంటర్‌ను ఎంఈఓ–2 లింగయ్యతో కలసి సందర్శించారు . సారథి మాట్లాడుతూ ప్రభుత్వం వినూత్న ఆలోచనతో 2025–26 విద్యా సంవత్సరానికి ఉపాధ్యాయ కరదీపిక, విద్యార్థులకు సబ్జెక్టుల వారీగా పరీక్షల మూల్యాంకన పుస్తకాలను అందించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జ్యోతి వెంకటరత్నం, వనపర్తి వెంకటసిద్దులు, కార్యదర్శి వెంకటాద్రి పాల్గొన్నారు.

తిరుచ్చిపై వెంకన్న విహారం



ఊరేగుతున్న దేవదేవేరులు

చంద్రగిరి : శ్రీనివాసమంగాపురంలో వెలసిన శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు శనివారం బంగారు తిరుచ్చి వాహనంపై విహరించారు. వారపు ఉత్సవాల్లో భాగంగా వేకువజామునే స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు సమర్పించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు కనుల పండువగా కల్యాణోత్సవం జరిపించారు. సాయంత్రం వేడుకగా ఊంజల్ సేవ చేపట్టారు. అనంతరం సర్వాలంకార శోభితుడైన శ్రీనివాసుడు ఉభయ దేవేరులతో కలసి తిరుచ్చిపై ఆశీనులై మాడ వీధులలో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు.

హోరాహోరీగా 'టాస్క్‌ఫోర్స్' క్రికెట్



విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న ఎస్పీ శ్రీనివాస్

తిరుపతి మంగళం :వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా శనివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులకు క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. పోలీస్ స్టేషన్ టీమ్, ఆపరేషన్ టీమ్, హెడ్ క్వార్టర్స్ టీమ్ పాల్గొన్నాయి. ఫైనల్స్‌కు హెడ్ క్వార్టర్స్, పోలీస్ స్టేషన్ టీమ్‌లు చేరుకున్నాయి. 10 ఓవర్లకు గాను పోలీసు స్టేషన్ టీమ్ 93 పరుగులు చేసి హెడ్ క్వార్టర్స్ టీమ్‌పై విజయం సాధించింది. విజేత జట్టుకు టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ ట్రోఫీని బహూకరించారు. మ్యాన్ ఆఫ్ ది సిరీస్ కానిస్టేబుల్ రాఘవకు షీల్డ్ అందజేశారు. డీఎస్పీలు వి. శ్రీనివాస రెడ్డి, ఎండీ షరీఫ్, ఏసీఎఫ్ జె.శ్రీనివాస్, ఆర్ఐ సాయి గిరిధర్, ఎస్ఐ రఫీ, ఆర్ ఎస్ఐలు లింగాధర్, విష్ణువర్ధన్, వినోద్ కుమార్ పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్ : రైల్వేస్టేషన్ సమీపంలోని బీఆర్ అంబేడ్కర్ తల్లి దీవెన ఆటో స్టాండ్ వద్ద గణపతి మండపంలో శనివారం భక్తులకు అన్నదానం చేశారు. ఆటో స్టాండ్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.బాలకృష్ణ మాట్లాడుతూ సమాజ హితం కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. ఆదివారం చేపట్టే వినాయక నిమజ్జనం కార్యక్రమంలో భక్తులందరూ పాల్గొనాలని కోరారు.అసోసియేషన్ కార్యదర్శి జగదీష్, సహాయ కార్యదర్శి విఘ్నేష్, రాజగోపాల్, భాస్కర్ పాల్గొన్నారు.



రాఘవేంద్ర నగర్‌లో..

తిరుపతి మంగళం : రాఘవేంద్రనగర్‌లో కొలువుదీరిన వినాయకునికి గత నాలుగు రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. శనివారం మధ్యాహ్నం ఈ మేరకు స్థానికులు అనిల్‌కుమార్, శ్యామల, భాస్కర్, జగదీష్, శీను, అమర్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

శ్రీవారి సేవలో డీజీపీ



డీజీపీకి జ్ఞాపిక అందిస్తున్న అదనపు ఈఓ

తిరుమల: తిరుమల శ్రీవారిని డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తా శనివారం సేవించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం ఇచ్చారు.టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

క్రీడలతో మానసికోల్లాసం



ట్రోఫీని అందజేస్తున్న జడ్జి నరసింహమూర్తి

తిరుపతి లీగల్: నిత్యం కేసులతో కుస్తీ పట్టే న్యాయవాదులు క్రీడల ద్వారా ఆరోగ్యం, మానసికోల్లాసం పొందవచ్చని తిరుపతి మూడో అదనపు జిల్లా జడ్జి ఎం గురునాథ్, ఎర్రచందనం కేసుల విచారణ సెషన్స్ జడ్జి నరసింహమూర్తి తెలిపారు. శనివారం అగ్రికల్చర్ కళాశాల మైదానంలో తిరుపతి న్యాయవాదుల స్పోర్ట్స్ కమిటీ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. మల్లికార్జునరావు , రవి జట్లు ఫైనల్‌కు చేరాయి. మల్లికార్జున రావు జట్టు విజేతగా నిలిచింది. ఎర్రచందనం కేసుల విచారణ సెషన్స్ జడ్జి నరసింహమూర్తి విజేత ట్రోఫీని అందజేశారు. తిరుపతి పదో అదనపు జిల్లా జడ్జి రామచంద్రుడు, రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోటేశ్వరరావు ,ఎర్రచందనం కేసుల విచారణ జూనియర్ జడ్జి శ్రీకాంత్, నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ గ్రంధి శ్రీనివాస్, న్యాయవాదుల అసోసియేషన్ అధ్యక్షుడు గొట్టి గజేంద్ర పాల్గొన్నారు.

చాందినీకి డాక్టరేట్



తిరుపతి రూరల్ : పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం పరిశోధక విద్యార్థిని ఎం.చాందినీకి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య అనురాధ తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ ఆచార్య జె.కాత్యాయని మార్గదర్శకత్వంతో 'యాన్ ఇంటెలిజెంట్ టూరిజం ఇన్ఫర్మేషన్ సిస్టమ్' అనే అంశంపై చాందిని పరిశోధన పత్రాలు సమర్పించినట్లు వెల్లడించారు.

గణనాథునికి భూమన పూజలు



గణపతికి పూజలు చేస్తున్న భూమన

తిరుపతి మంగళం : ఎల్‌బీసీ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన గణాథుని ప్రతిమకు వైఎస్సార్‌సీపీ తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకర రెడ్డి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడ గో పూజ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేలా చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించు స్వామీ అంటూ మొక్కుకున్నారు. అరాచక పాలన పోయి ప్రజాసంక్షేమ పాలన వచ్చేలా ఆశీర్వదించు స్వామీ అని వేడుకున్నారు. వైఎస్సార్‌సీపీ మున్సిపల్ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ ఆదిలక్ష్మి, నేతలు రఘునాథ రెడ్డి, ఊతుకుంట మోహన్, చాంద్‌బాషా, నాగేశ్వర రావు పాల్గొన్నారు.

'గిడుగు'.. సరళంగా అడుగు



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ భువనేశ్వరి

తిరుపతి సిటీ : పద్మావతి జూనియర్ కళాశాలలో శనివారం గిడుగు రామమూర్తికి ఘనంగా నివాళులర్పించారు. ప్రిన్సిపల్ భువనేశ్వరి మాట్లాడుతూ గ్రాంధికంలోని తెలుగు భాషను సరళంగా మార్చి వ్యవహారిక భాషగా తీర్చిదిద్దిన ఘనత గిడుగు రామమూర్తికే దక్కుతుందని కొనియాడారు. అధ్యాపకులు జయమ్మ, కల్పన, మునేంద్ర, ధనమ్మ, హాస్టల్ వార్డెన్ స్నేహలత పాల్గొన్నారు.

కమాండ్ కంట్రోల్ పనులు వేగవంతం

తిరుపతి తుడా : ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ పనులను వేగవంతం చేయాలని, నవంబర్‌లోపు అందుబాటులోకి తీసుకురావాలని స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య ఆదేశించారు. శనివారం కమాండ్ కంట్రోల్ సెంటర్ పనుల పురోగతిపై సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని అన్ని ప్రధాన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సెప్టెంబర్ చివరిలోపు తాత్కాలిక కమాండ్ కంట్రోల్ సెంటర్ పనులు పూర్తి కావాలని సంబంధిత ఏజెన్సీ అధికారులను ఆదేశించారు. అక్టోబర్ రెండవ వారంలో గో లైవ్ ప్రారంభం కావాలని చెప్పారు. సమావేశంలో ఎస్ఈ శ్యామ్‌సుందర్, ఈఈ రవి, డీఈ రాజు పాల్గొన్నారు.

చెత్త నిర్వహణపై అవగాహన అవసరం

తడి, పొడి చెత్తను వేర్వేరు అందించడంపై ప్రజలకు మైకుల ద్వారా అవగాహన కల్పించాలని కమిషనర్ మౌర్య ఆదేశించారు. నగరంలోని పరదాల వీధి, రామచంద్ర పుష్కరిణి, జ్యోతి థియేటర్ కూడలి, నెహ్రూ నగర్, కామమ్మ గుడి వీధి, ఐఎస్ మహల్, ఉర్దూ స్కూల్ వీధి, బ్రహ్మంగారి గుడి తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను కార్పొరేటర్ కల్పన, అధికారులతో కలసి పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ డ్రైనేజీ కాలువల్లో పేరుకు పోయిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. నైట్ షెల్టర్ లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎస్ఈ శ్యామ్‌సుందర్, ఎంఈ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్ సేతుమాధవ్, డీఈలు మధు, శిల్ప, సర్వేయర్ కోటేశ్వర రావు, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య పాల్గొన్నారు.

త్రిభాషా విధానంతో కేంద్రం కుట్ర



మాట్లాడుతున్న అన్నపూర్ణమ్మ

తిరుపతి కల్చరల్ : త్రిభాషా విధానంతో కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని, దక్షిణ భారతదేశానికి ద్రోహం చేస్తోందని శ్రీకాళహస్తీశ్వరాలయ ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యులు జె.అన్నపూర్ణమ్మ ఆరోపించారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడారు. త్రిభాషా విధానంలో హిందీ పరీక్షల కారణంగా ఉత్తర భారతీయులే నాటుకుపోతున్నారని, మన పిల్లల భవిత ప్రశ్నార్థకంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలుగు భాషను కనుమరుగు చేసేందుకు బీజేపీ ప్రభుత్వం తెగబడుతోందని మండిపడ్డారు. పన్నుల వాటాలను సైతం ఉత్తర భారతదేశానికి అధిక మొత్తంలో కట్టబెడుతోందని, అదాని, అంబానికి దోచి పెడుతోందని విమర్శించారు. ఈ వివక్షతపై మేధావులు నిలదీయాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. శుభకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నూతన వసతి భవన పరిశీలన

తిరుమల: తిరుమలలో నూతనంగా నిర్మించిన యాత్రికుల వసతి సముదాయం–5 భవనాన్ని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈఓ వెంకయ్య చౌదరి శనివారం పరిశీలించారు. భవనంలోని హాళ్లు, కల్యాణ కట్ట, మరుగుదొడ్లు, అన్న ప్రసాద వితరణ కేంద్రాలను సందర్శించారు. చైర్మన్ మాట్లాడుతూ ప్రస్తుతం తిరుమలలో 45 వేల మందికి మాత్రమే వసతి సౌకర్యం ఉందని, కొత్తగా నిర్మించిన ఈభవనంలో 2,500 మంది యాత్రికులు సులభంగా వసతి పొందగలరని వివరించారు. బ్రహ్మోత్సవాల సమయంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందుబాటులోకి తీసుకువస్తామని వెల్లడించారు. అదనపు ఈఓ మాట్లాడుతూ ఈ భవనంలో అవసరమైతే మరో వెయ్యిమందికి సర్దుబాటు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. చంటి పిల్లల తల్లుల కోసం ప్రత్యేకంగా మిల్క్ ఫీడింగ్ గది ఏర్పాటు చేశామని చెప్పారు. ఒకేసారి 1,400 మంది అన్నప్రసాదాలు స్వీకరించేలా హాలు నిర్మించినట్లు వివరించారు. టీటీడీ సీఈ సత్యనారాయణ, ఈఈలు వేణుగోపాల్, శ్రీనివాసరావు, సుధాకర్, డిప్యూటీ ఈఓలు రాజేంద్ర, సోమన్నారాయణ, డీఈ చంద్రశేఖర్, వీజీఓ సురేంద్ర పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో నిమజ్జనోత్సవం

తిరుపతి కల్చరల్ : తిరుపతి నగరంలో భక్తి ప్రపత్తుల నడుమ ప్రశాంత వాతావరణంలో వినాయక నిమజ్జనోత్సవం చేపట్టాలని కమిటీ ప్రతినిధులు పిలుపు నిచ్చారు. శనివారం ఉత్సవ కమిటీ కార్యాలయం నుంచి స్కూటర్ ర్యాలీ చేపట్టారు. ప్రభుత్వ అధికారులు, కమిటీ సూచనలు పాటిస్తూ నిమజ్జనాలను విజయవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఉత్సవ కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్, గోపీనాథ్‌రెడ్డి, మునికృష్ణ, వెంకటేష్, నవీన్‌రెడ్డి, బాబు వరప్రసాద్, నాగేశ్వరరావు, ఆదం అనిల్‌రెడ్డి, వెంకట్ కృష్ణ, హేమ, కిరణ్, రఘురామిరెడ్డి పాల్గొన్నారు.


నేడు నారాయణదాసు జయంతి

తిరుపతి కల్చరల్ : హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు 160వ జయంతిని ఆదివారం మహతి కళాక్షేత్రంలో నిర్వహించనున్నారు. అందులో భాగంగా ఉదయం 8.30 గంటలకు ఎస్వీ సంగీత కళాశాల ప్రాంగణంలోని ఆదిభట్ల నారాయణదాసు విగ్రహానికి పుష్పాంజలి ఘటించి, బృందగానం చేపట్టనున్నారు. అనంతరం మహతి కళాక్షేత్రంలో ఉదయం 9 నుంచి హరికథ ప్రాశస్త్యం, హరికథ– ధర్మప్రచారం, ఆదిభట్ల నారాయణదాసు జీవిత విశేషాలు, హరికథాగానం కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

రేపటి నుంచి హరికథ వైభవంపై శిక్షణ

హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1 నుంచి 10వ తేదీ వరకు హరికథా కళాకారులకు 'హరికథ వైభవం' పేరిట శిక్షణ ఇవ్వనున్నారు. శ్వేత భవనంలో శిక్షణ తరగతులు చేపట్టనున్నారు.

అలరించిన 'శ్రుతిలయలు'



ఆలపిస్తున్న గాయనీ గాయకులు

తిరుపతి కల్చరల్ : విశిష్ట దర్శకులు కె.విశ్వనాథ్, బాపును స్మరిస్తూ తిరుపతి ఫిలిం సొసైటీ వారు శనివారం మహతి కళాక్షేత్రంలో శ్రుతిలయలు పేరిట సంగీత విభావరి నిర్వహించారు. విశ్వనాథ్, బాపు చిత్రాల్లోని అద్భుతమైన పాటలను గాయనీ గాయకులు రామ్‌చరణ్, కీర్తి, జయరాం ఆలపించి అలరించారు. ప్రత్యేక ఆహ్వానితులుగా యూనియన్ బ్యాంక్ డీజీఎం సూర్యప్రకాశరావు, కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పీసీ రాయులు, ఎస్‌పీడీసీఎల్ ఇంజినీర్ కృష్ణారెడ్డి హాజరయ్యారు. సొసైటీ చైర్మన్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, అధ్యక్షుడు వైఎస్.బాబు, కార్యదర్శి సీఆర్‌కే శేషగిరిరావు, కోశాధికారి యు.ప్రసాదరావు, ఉపాధ్యక్షులు బుజ్జిబాబు, అనసూయ, మధుసూదన్‌రెడ్డి, స్వరాజ్యలక్ష్మి, శమంతకమణి, గుల్జార్, శాంతావాణి పాల్గొన్నారు.

నేడు మహిళా వర్సిటీలో..

సంగీత విభావరిని అనివార్య కారణాలతో పద్మావతి మహిళా యూనివర్సిటీలోని ఇందిరాప్రియదర్శిని ఆడిటోరియానికి మార్చినట్లు తిరుపతి ఫిలిం సొసైటీ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఆదివారం సాయంత్ర 6 గంటలకు ప్రదర్శన ఉంటుందని వెల్లడించారు.